
మూసాపేట వార్డు కార్యాలయం వద్ద ప్రజాపాలన దరఖాస్తులు ఇచ్చేందుకు క్యూ లైన్‌లో ఉన్న ప్రజలు


ప్రగతినగర్ కమ్యూనిటీహాల్ వద్ద దరఖాస్తులు ఇచ్చేందుకు కిక్కిరిసిన ప్రజలు

రెండో రోజూ అదే స్పందన

• పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చూడాలి : ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



శంషీగూడ, రాంనరేష్‌నగర్‌లలోని ప్రజాపాలన కేంద్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు


శంషీగూడలోని ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలని, దరఖాస్తు చేసుకోదలచిన వారు తమ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కార్యలయంలోని ప్రత్యేక కౌంటర్లలోని వారికి కావలసిన పథకానికి సంబంధించి దరఖాస్తు ద్వారా అక్కడి అధికారులు ఇచ్చిన రసీదు పొందాలని సూచించారు.

◆ మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2500 నగదు, గ్యాస్ సిలిండర్ రూ.500, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల కరెంటు రాయితీ, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకం ద్వారా పింఛన్లు వంటి పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

◆ ప్రతి డివిజన్‌కు 4 కౌంటర్లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎక్కువ మంది జనాభా ఉన్నట్లయితే మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పేదల జీవితాల్లో వెలుగు నింపే కార్యక్రమం అన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, తెల్లరేషన్ కార్డు జిరాక్స్, ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటో అందజేయాలన్నారు.

రామ్‌నరేష్ నగర్‌కాలనీలో...

రామ్‌నరేష్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివారావుతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలన్నారు. దరఖాస్తులను కేంద్రంలోని అధికారులకు అందజేసి రసీదు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, నాయకులు దామోదర్‌రెడ్డి, నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, బ్రహ్మం, రఘు, చంద్రయ్య, శ్రీశైలం, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో రెండోరోజు అత్యధిక దరఖాస్తులు

మూసాపేట: ప్రజాపాలన కార్యక్రమంలో మూసాపేటలో ప్రజలు రెండోరోజు అధిక సంఖ్యలో వచ్చి దరఖాస్తు చేసుకున్నారు. భరత్‌నగర్ కాలనీలో మొదటి రోజు 250, రెండో రోజు 354 దరఖాస్తులు స్వీకరించారు. మూసాపేట వార్డు కార్యాలయం వద్ద ఉన్న కేంద్రానికి మొదటి రోజు 784, రెండో రోజు 1011 దరఖాస్తులు వచ్చాయి. ప్రగతినగర్ కమ్యూనిటీహాల్‌లో మొదటి రోజు 350, రెండో రోజు 400 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

పథకాలు అందేలా కార్యకర్తలు పనిచేయాలి

శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను శుక్రవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి కేంద్రంలో ప్రజలకు అవసరమైన దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలాగా పనిచేయాలన్నారు. ప్రతి కేంద్రాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అన్ని విధాలుగా అందేలా చూస్తామన్నారు. ప్రజాపాలనకు నిదర్శనమే నేటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు. శంషీగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించారు. ఎటువంటి సందేహం ఉన్నా అధికారుల సహాయం తీసుకొని ఫారాన్ని పూర్తి చేయవచ్చని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులందరూ దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగపరచుకోవాలన్నారు.

దరఖాస్తు కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

మోతీనగర్: ప్రజాపాలన రెండోరోజు మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లోని కేంద్రాల్లో దరఖాస్తుదారులు శుక్రవారం ఉదయం నుంచి క్యూలో బారులు తీరారు. మూసాపేట డివిజన్ పాండురంగనగర్ పార్కు, మోతీనగర్ మీ సేవ కేంద్రానికి ఆరు గ్యారంటీల పథకం కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి ఉదయం నుంచి వేచి ఉన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్‌హాల్, వి.రామారావు నగర్ కమిటీ హాల్‌లో, ఆర్‌కే సొసైటీ వివేకానందనగర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలను స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు.

◆ అదే విధంగా మూసాపేట డివిజన్ పాండురంగనగర్ పార్కులో, మోతీనగర్ మీసేవలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆమె వెంట మూసాపేట, అల్లాపూర్ ఏఈలు అనురాగ్ రంజిత్, ఎస్ఎఫ్ఏ శివం తదితరులు ఉన్నారు.

దరఖాస్తు ఫారాలు పంపిణీ చేసిన నాయకులు...

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజాపాలన సెంటర్ల దగ్గర కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం హస్మత్‌పేట మోడల్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన సెంటర్‌లో ప్రజలు బారీగా తరలి రావడం దరఖాస్తు ఫారాలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ అధ్వర్యంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ దండుగుల అమూల్య నాయకులు శ్రీరాములు, షాయిన్‌షా తదితరులు దరఖాస్తు ఫారాలను అందించారు. వారికి దరఖాస్తు ఫారాలను సైతం నింపి ఇచ్చారు. ఏమైన ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణలో ఆలస్యం

- గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి
- ఒక కేంద్రంలో 500 దరఖాస్తు ఫారాలు ఇస్తున్న అధికారులు
- అయినా సరిపోని ఫారాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తు ఫారాల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన సెంటర్లలో ప్రజలు కిక్కిరిసి పోయారు. దరఖాస్తు ఫారాలను అందిచేందుకు వస్తున్న ప్రజలకు దరఖాస్తు ఫారాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్‌కు 500 ఫారాలను అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఫారాల కొరత ఏర్పడుతోంది. దరఖాస్తుల స్వీకరణ కూడా ఆలస్యం అవుతుండటంతో గంటల కొద్ది క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ప్రజాపాలనకు రెండో రోజు కూడా ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో పాటు ఒక్కసారిగా సెంటర్ల వద్దకు వచ్చి దరఖాస్తు ఫారాలను నింపుతూ కొందరూ.. దరఖాస్తు ఫారాలు లేక జిరాక్స్ సెంటర్లు, మీ సేవ సెంటర్లకు పరుగులు పెడుతున్న మరి కొందరు కనిస్తున్నారు. చాలా మంది ప్రజలు ఇంటి దగ్గరనే ఫారాలను పూర్తి చేసుకుని క్యూ లైన్లలో ఉండి ఫారాలను అదికారులకు అందిస్తున్నారు.

సెంటర్లలో రద్దీ తగ్గలంటే సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది....

సెంటర్ల దగ్గర ప్రజల ఇబ్బందులు, క్యూ లైన్లలో గంటల తరబడి వేచి చూసే పరిస్థితిని తగ్గించాలంటే సిబ్బందిని పెంచాలని కోరుతున్నారు. మరో రెండు క్యూ లైన్లను అదనంగా ఏర్పాటు చేస్తే వచ్చిన వారు వచ్చినట్లుగా అధికారులకు దరఖాస్తు ఫారాలను అందించి వెళ్లేందుకు వీటు కలుగుతుందని పలువురు అంటున్నారు. మోడల్ మార్కెట్ సెంటర్, గంగపుత్ర సంఘం సెంటర్, వార్డు కార్యాలయం సెంటర్లలో అదనంగా రెండు కౌంటర్లు పెంచితే ప్రజలు గంటల తరబడి వేచి చూసే పరిస్థితి తప్పుతుందని అధికారులు అ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండోరోజు పెరిగిన దరఖాస్తుల స్వీకరణ..

ప్రజాపాలనలో మొదటి రోజు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన నాలుగు సెంటర్లలో 1783 దరఖాస్తులను అదికారులు స్వీకరించారు. రెండో రోజు 2500 దరఖాస్తులు స్వీకరించినట్లు సమాచారం. అయితే అదికారులు ఇస్తున్న దరఖాస్తు ఫారాలు మాత్రం తిరిగి రావడం లేదని జిరాక్స్ కాపీలు మాత్రమే వస్తున్నాయని అధికారులు అంటున్నారు. తాము ఉదయం సెంటర్లలో పంపిణీ చేస్తున్న ఆరు పథకాల దరఖాస్తు పారాలు తిరిగి సెంటర్లకు రాకుండా ఎక్కడి వెళుతున్నాయో తెలియడం లేదని జిరాక్స్ కాపీలు మాత్రమే వస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని అంటున్నారు.

జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్‌లో శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని తెలిపారు. దరఖాస్తు రాయటం రాని వారికి రాసేందుకు వలంటీర్లు ఉన్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు,నాయకులు భాస్కర్, సుశీల్, శారద తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేస్తా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలకు హామీ ఇచ్చారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీరాజరాజేశ్వరీ హౌస్ ఓనర్ వేల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చి తనను గెలిపించినందుకు జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. కాలనీలలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాసాచారి, ఆనంద్, ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం, గణేష్, నాయకులు మేకల హరినాథ్, బల్వంత్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, కర్రె జంగయ్య, ఖాదీర్, జాంగీర్, బుర్రి యాదగిరి, పోచయ్య, రాజుగౌడ్, అశోక్ ఇబ్బు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీహాల్ ప్రారంభిస్తూ...


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నేడు ఆలయ వార్షికోత్సవ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్‌కాలనీలో వేంచేసియున్న అయ్యప్పస్వామి దేవస్థానం వార్షికోత్సవం అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శనివారం 30వ ఉదయం 9గంటలకు 108కళశాలతో అయ్యప్ప స్వామి అభిషేకం, సాయంత్రం కూకట్‌పల్లి కాలనీ పురవీధుల్లో ఏనుగు అంబారి ఊరేగింపు మహోత్సవం,31తేదీ ఆదివారం 18 కలశాలతో మహాపడిపూజ, మహాఅన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలిపారు.

శుభాకాంక్షలు



కూకట్‌పల్లి: అంతర్జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ మెజీషియన్ సామల వేణుకి కేంద్ర ప్రభుత్వం కేంద్ర చలనచిత్ర సెన్సార్ బోర్డు సలహా సభ్యుడిగా నియమించింది. ఈ సందర్భంగా సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ, కూకట్‌పల్లి జనసేన నాయకుడు కొల్లా శంకర్ శుక్రవారం వేణుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామల వేణు విదేశాల్లో మన సంస్కృతిని బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారన్నారు. 42 ఏళ్లుగా 34 కంటే ఎక్కువ దేశాల్లో 7వేల మ్యాజిక్ షోలు ప్రదర్శించారని తెలిపారు.

గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణం

• కూల్చేసిన చోటే మళ్లీ నిర్మాణం • చోద్యం చూస్తున్న అధికారులు



కూల్చిన ప్రదేశంలో తిరిగి అక్రమ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

ఆల్విన్‌కాలనీ: కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాన్ని చేపట్టారు. గతంలో మండలాధికారులు తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టారు. దీన్ని అదనుగా చూసిన సదరు నిర్మాణదారులు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళలో అక్రమననిర్మాణం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి కబ్జాకు పాల్పడ్డాడు. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్‌కాలనీ రెండవ ఫేజు చివరి బస్‌స్టాప్ ఆనుకొని వున్న సర్వే నెంబర్ 276లో గల ప్రభుత్వ భూమి కబ్జా చేసి భారీ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారు.

◆ స్థానికులు, స్థానిక కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు మేడ్చల్ జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓ, మండల అధికారులకు వినతిపత్రాల ద్వారా ఫిర్యాదు చేస్తే నాడు నిర్మాణాన్ని అడ్డుకొని కూల్చివేతలు చేపట్టారు. గత నాలుగు రోజుల నుంచి రాత్రి వేళల్లో భారీ నిర్మాణం చుట్టూ కూల్చివేసిన ప్రాంతంలో కాంపౌండ్ వాల్ నిర్మించి తిరిగి పునర్నిర్మాణం చేపట్టారు. కూలివేసిన చోట గుట్టు చప్పుడు కాకుండా పునర్నిర్మాణం చేయటంతో స్థానికులు ఫిర్యాదు చేస్తే కూల్చివేతలు చేపట్టకుండా మిన్నకుండటంతో స్థానికులు మండలాధికారుల అలసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆమ్యామ్యాలు ముట్ట చెప్పటం వల్లనే ఈ నిర్మాణాన్ని అధికారులు కాపాడుతున్నారని పేర్కొంటున్నారు.

◆ ఈ స్థలం బస్‌స్టాండ్ కోసం నాటి దివంగత కార్మిక మంత్రి పి. జనార్దన్‌రెడ్డి చుట్టుపక్కల ఉన్న బస్తీల అవసరాల దృష్ట్యా బస్సులు తిరగడానికి అనువుగా ఉంటుందని బస్‌స్టాండ్ స్థలమంటూ శంకుస్థాపన చేశారు. ఈ స్థలం ఖాళీగా ఉండటంతో దీన్ని అదనుగా చూసుకొని స్థానిక నిర్మాణదారుడు అక్రమ నిర్మాణానికి పూనుకున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించి ప్రజల అవసరాల దృష్ట్యా బస్‌స్టాండ్ స్థలాన్ని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపు డ్రంకన్ డ్రైవ్

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

హఫీజ్‌పేట్ : మద్యం తాగి వాహనాలతో రోడ్లపైకి రావద్దని చందానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి 8 గంటల నుంచి తెల్లవారు జామున 3 గంటల వరకు ప్రత్యేక టీంలతో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించే వారు వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాయదుర్గం: శాస్త్రీయ నృత్యకళలు, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి మరింతగా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి డాక్టర్ రామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శ్రీద వరాళి చదలవాడ కూచిపూడి రంగప్రవేశం ఆద్యంతం అందరినీ ఆకట్టుకునేలా సాగింది. వినాయకనిను విన అంటూ నర్తకి తొలి నాట్య ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. వెంకయ్యనాయుడు నృత్యప్రదర్శనను తిలకించి ఆమెను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ తదితరాలను మనం కాపాడుకోవాలని, మన పిల్లలకు నేర్పించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మప్రచారక్ రామినేని, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, సినీ దర్శకులు రాఘవేంద్రరావు, మాజీ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవిచౌదరి, సినీ నృత్య దర్శకులు కెవి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గచ్చిబౌలి: డ్రంకన్ డ్రైవ్‌లో, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారు లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ కోరారు. శనివారం కూకట్‌పల్లి కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్‌లో హాజరైతే కేవలం జరిమానాతో క్లోజ్ చేస్తారని వారు సూచించారు డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు వారి ఆధార్‌కార్డు జిరాక్స్, లైసెన్స్, వెహికిల్ ఆర్‌సీలను,.. డ్రైవింగ్ లైసెన్స్ కేసులు ఉన్నవారు ఆధార్‌కార్డు, వెహికిల్ ఆర్‌సీ జిరాక్స్ తీసుకొని వచ్చి తమ కేసులను క్లోజ్ చేయించుకోవాలని వారు సూచించారు.

మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో సత్తా చాటాలి

హఫీజ్‌పేట్ : రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రంగారెడ్డి మాస్టర్ అథ్లెట్ సత్తా చాటాలని మాస్టర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన మాస్టర్స్ ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ నెల 30,31వ తేదీలలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే రంగారెడ్డి జిల్లా టీం సభ్యుల ఎంపికతో పాటు ఎంపికైన వారికి ట్రాక్ సూట్లను కార్యదర్శి సురేందర్, ట్రెజరర్‌లతో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తుమ్మల ఏసురత్నం, లీలావతి, నాగలక్ష్మి, మానస, జ్యోతి, జితేందర్ పటేల్ పాల్గొన్నారు.

'సండే ఈవింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ప్రత్యేక 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'లెట్స్ గో, మూవ్ ఆన్ అండ్ క్రియేట్ యువర్ న్యూఇయర్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్‌కాలనీలో నివసించే సునీత అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కటిక రవి, దేవేందర్, ఫజల్, తులసిరామ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మండల పూజ


మండల పూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బాబూరావు, తదితరులు

మూసాపేట: జనతానగర్‌లోని శ్రీసాయి అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం మండల పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు మహా గణపతి హోమం, 9కు 108 కలశములతో కుంభాభిషేకం, మధ్యాహ్నం 12.30కు అన్నదానం, సాయంత్రం 5గంటలకు అయ్యప్పస్వామి వారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, రాత్రి 7కు మహా పడిపూజ, రాత్రి 9.30కు కనకాభిషేకం, అల్పాహారం వంటి కార్యక్రమాలు అర్చకులు పవన్ సమక్షంలో జరిగాయి. మాజీ కార్పొరేటర్ పి.బాబూరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అయ్యప్పస్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా గోపాల్, ఐలయ్య, కేబుల్ శ్రీనివాస్, బి.నర్సింగ్, భాస్కర్, సుశీల్, మన్మథ, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపును మూసివేయాలి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని 3వ ఫేజు ఎల్ఐజీ వద్ద సాయి బాలజీ వైన్స్ షాపును మూసి వేయాలని స్థానికులు ముఖ్యమంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా స్థానికులు, ఎల్ఐజీ వాసులు మాట్లాడుతూ... నివాస యోగ్యానికి ఇచ్చిన ఎల్ఐజీ ఫ్లాట్స్ వైన్స్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వటం అన్యాయమన్నారు. మందుబాబులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదన్నారు.

ఫెడరల్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం


బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి చౌరస్తాలోని బన్సాల్ టవర్స్‌లో ఫెడరల్ బ్యాంక్ శాఖను శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రి సీఈఓ యోబులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ... కూకట్‌పల్లిలోని వినియోగదారులకు మరిన్ని సేవలు అందించటానికి బ్రాంచ్‌ని నెలకొల్పామన్నారు. ఈ కార్యక్రమంలో సీఏ ధీరజ్ అగర్వాల్, బ్యాంక్ అధికారులు దిలీప్, జోస్ థామస్, సీవీ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ఒయాసిస్ స్కూల్ బాలికలు

రాయదుర్గం: తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ బాలికలు ఎంపికయ్యారు. స్కూల్‌లో పదవ తరగతి చదివే ఆధ్యామేఘన అండర్–17 బాలికల విభాగంలో బంగారు పతకం, ఆరవ తరగతి చదివే సమన్విత అండర్–14 బాలికల విభాగం తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలో బంగారు పతకాలను సాధించారు. వీరు వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో వారిద్దరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలను మధ్యప్రదేశ్ రాష్ట్రం బేతుల్‌లో డిసెంబర్ 31 నుంచి జనవరి 5వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.